సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 29 । సెప్టెంబర్ । 2025



వానొస్తే.. గండమే

గ్రామాల్లో వాగులపై వంతెనలు లేకపోవడంతో సామాన్యులు ప్రాణాలు కోల్పోవాల్సిన దౌర్భాగ్యం ఏర్పడింది. 8లో▸



శాకాహారంతో..

ఆరోగ్యవంతమైన సమాజం కోసం శాకాహారం అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో▸



పిటిషన్ వెనక్కి తీసుకోవాలి

ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ జీఓ జారీ చేస్తే కోర్టులో పిటిషన్ వేయడం సరికాదని జేఏసీ నాయకులు అన్నారు. 8లో▸

‘ఫ్యూచర్’కు కొత్త ఊపు

ఎఫ్‌సీడీఏ భవనం, రేడియల్ రోడ్లకు శంకుస్థాపన

- త్వరలో పాలన ఇక్కడి నుంచే అని సీఎం ప్రకటన
- రియల్ ఎస్టేట్‌కు ఊతం
- అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆశలు



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికారులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఫ్యూచర్‌సిటీ అంకురార్పణతో కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుని పరుగులు తీసే అవకాశం ఉంది. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు భవిష్యత్తు నగరంగా భావించే భారత్ ఫ్యూచర్‌సిటీ న్యూయార్క్ కంటే అద్భుతంగా నిర్మించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఫ్యూచర్ సిటీలో భూముల ధరలకు రెక్కలొచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనాలు, ఆస్పత్రి సహా ఇంటిగ్రేటెడ్ విద్యాలయానికి శంకుస్థాపన చేసిన ప్రభుత్వం దసరా నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని తాజాగా ఆదివారం మీర్‌ఖాన్‌పేట వేదికగా నిర్మించతలపెట్టిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) భవనాలు సహా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు శంకుస్థాపన చేసింది. డిసెంబర్ నుంచి ఏకంగా ప్రభుత్వ పాలనే ఈ కేంద్రంగా నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి ప్రపంచం మొత్తం దృష్టిని ఇటువైపు మళ్లించారు.

ఇతర నగరాలతో కనెక్టివిటీ

మొత్తం 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్‌సిటీ (ఫోర్త్ సిటీ)ని తీర్చిదిద్దనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు.. ఏడు మండలాలు.. 56 రెవెన్యూ గ్రామాలు.. 765 చదరపు కిలోమీటర్ల పరిధితో ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసింది. కర్బన ఉద్గారాలు, ఇతర గ్రీన్‌హౌస్ వాయువులను పీల్చుకుని, మానవాళికి అవసరమైన ఆక్సిజన్‌ను ఇచ్చే వృక్ష సంపదను పెంచి ఈ ప్రాంతాన్ని నెట్‌జీరో సిటీగా తీర్చిదిద్దనుంది. ఇటు ఫ్యూచర్‌సిటీ నుంచి శ్రీశైలం వరకు, అటు రీజినల్ రింగ్ రోడ్డు నుంచి బందర్‌పోర్ట్ వరకు, చెన్నై, బెంగళూరు నగరాలకు హైస్పీడ్ ట్రైన్ సర్వీసులు ఇక్కడివారి దరి చేరనున్నాయి. నిరంతరాయ విద్యుత్ సరఫరా, తాగునీరు, సర్వీసు రోడ్లు, గ్రీనరీ ఇలా న్యూయార్క్‌ను మించిన మౌలిక సదుపాయాలు ఇక్కడ సమకూర్చనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో సిటిజన్ల దృష్టాంతా ఫ్యూచర్‌సిటీ వైపే మళ్లింది.

అట్టహాసంగా శంకుస్థాపన

మీర్‌ఖాన్‌పేట వేదిగా ఆదివారం ఎఫ్‌సీడీఏ భవనాలు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు శంకుస్థాపన కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. భూమిపూజ అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎఫ్‌సీడీఏ మాస్టర్ ప్లాన్ విభాగం ఆయా జోన్లతో రూపొందించి, ప్రదర్శించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను వారంతా తిలకించారు. న్యూయార్క్, టోక్యో, లండన్, జపాన్, దుబాయ్‌లకు మించి భవిష్యత్తు భారత్ నగరాన్ని తీర్చిదిద్దబోతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, హెచ్ఎండీ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక, కలెక్టర్ నారాయణరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



హాజరైన పార్టీశ్రేణులు, స్థానికులు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న కేటీఆర్

అవన్నీ తప్పుడు ‘మార్గాలు’

- సీఎం ఆస్తుల విలువ పెంచుకొనేందుకే ఆ రోడ్లు
- అందుకే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్పు
- రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కడ్తాల్: సీఎం రేవంత్‌రెడ్డి తన కుటుంబం, బంధువుల ఆస్తుల విలువ పెంచుకోవడానికే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు చేయడంతో పాటు ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చడం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కడ్తాల్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల మీదుగా ఏర్పాటు చేస్తున్న 765 హైటెన్షన్ విద్యుత్‌లైన్ అలైన్‌మెంట్‌కు వ్యతిరేకంగా బాధిత రైతులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 21వ రోజుకు చేరుకున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగర్జన సభకు వెళ్తున్న కేటీఆర్ దీక్ష శిబిరం వద్దకు చేరుకుని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగా సొంత భూముల విలువ పెంచుకోవడానికి ఎవరికీ అవసరం లేని గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. రోడ్డు నిర్మాణం కోసం 1,200 ఎకరాల పట్టా భూములను రైతుల నుంచి సేకరిస్తుండంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. సొంత ఆస్తుల విలువను పెంచుకోవడంతో పాటు అనుయాయులకు దోచిపెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని, రైతులకు అండగా ఉంటామన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో పేదల కడుపుకొట్టకుండా, వారికి నష్టం కలుగకుండా అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తు చేశారు. హైటెన్షన్ విద్యుత్‌లైన్ బాధిత రైతులు కలిసి వస్తే న్యాయస్థానంలో వారి పక్షాన పోరాడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజనీ సాయిచంద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. వేంకటేశ్వర కల్యాణం

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ఈ ఉత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

న్యూస్‌రీల్

నేడు మంత్రి శ్రీధర్‌బాబు రాక

మొయినాబాద్: మున్సిపల్ పరిధిలోని అజీజ్ నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవానికి సోమవారం ఐటీ, శాసన సభ వ్యవహారాల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రానున్నట్లు మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మంత్రితోపాటు స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరవుతారని చెప్పారు.

ఎర్త్ సెంటర్‌ను సందర్శించిన స్వీడన్ దేశస్తులు



కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్‌సెంటర్‌ను ఆదివారం స్వీడన్ దేశస్తులు జాన్‌బుచ్ అండర్సన్, డాక్టర్ ఒయింకన్ పీటర్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈస్ట్ సెంటర్ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎర్త్ సెంటర్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు సీజీఆర్ సంస్థ చేస్తున్న సేవలు బాగున్నాయని ప్రశంసించారు. అనంతరం స్థానిక వీరాంజనేయ స్వామి ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి, సీజీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈస్ట్ సెంటర్ అధ్యక్షుడు సీతారావు, కార్యదర్శి నరసింహన్, వీరనారి చాకలి ఐలమ్మ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ప్రియాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏదుళ్ల బాల్‌రాజ్‌కు కీర్తిరత్న



పురస్కారం అందుకుంటున్న బాల్‌రాజ్

ఇబ్రహీంపట్నం రూరల్: సాహిత్య రంగంలో తెలుగు భాషకు వన్నె తెస్తూ విశేషమైన కృషి కనబర్చినందుకు గాను మండలంలోని నాగన్‌పల్లి గ్రామానికి చెందిన ఏదుళ్ల బాల్‌రాజ్‌ను జాతీయస్థాయి కీర్తిరత్న పురస్కారం వరించింది. ఈ మేరకు ఆదివారం నగరంలోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో భవానీ సాహిత్య వేదిక ప్రధాన కార్యదర్శి వియల్ భవాని, అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురస్కారం రావడం సంతోషంగా ఉందన్నారు. తెలుగు భాషను కాపాడడం కోసం మరింతగా కృషి చేస్తానని తెలిపారు. బాల్‌రాజ్ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు.

మూసీలో తగ్గిన వరద ఉద్ధృతి



మణికొండ: ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్‌సాగర్‌లకు వరద ఉద్ధృతి తగ్గిపోవటంతో గేట్లను తగ్గించారు. దీంతో మూసీ నదిలో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఆదివారం ఉదయం నుంచి జంట జలాశయాల గేట్లను మూస్తూ వచ్చారు. మధ్యాహ్నం తర్వాత గండిపేట నుంచి 4 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 920 క్యూసెక్కుల నీటిని మాత్రమే వదిలారు. పూర్తి స్థాయి నీటి మట్టం 1,790 అడుగులకు 1,789.15 అడుగులుగా నీటి మట్టం ఉండగా ఎగువ నుంచి 1,300 క్యూసెక్కుల వరద వస్తోందని అధికారులు తెలిపారు. హిమాయత్‌సాగర్ నీటి మట్టం 1763.50కి గాను ప్రస్తుతం 1,762.35 అడుగుల నీరు ఉందని, పైనుంచి 2,600 క్యూసెక్కుల వరద వస్తోందన్నారు. రెండు గేట్లను 3 అడుగుల మేర ఎత్తి 1981 క్యూసెక్కుల నీటిని మూసీ నదికి వదులుతున్నామన్నారు.

తెరుచుకున్న రోడ్లు

శనివారం రాత్రి వరకు మూసీ నదిలో పెద్ద ఎత్తున నీరు రావటంతో నార్సింగిలోని ఔటర్ సర్వీసు రోడ్లతో పాటు నార్సింగి నుంచి మంచిరేవుల గ్రామానికి వెళ్లే రోడ్లను మూసి వేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం నుంచే గండిపేట గేట్లను తగ్గించటంతో మూసీలో వరద తగ్గిపోయింది. తిరిగి వర్షం కురిసి, వరద వస్తుందనే ఉద్దేశంతో సాయంత్రం వరకు రోడ్లను అలాగే మూసి ఉంచారు. సాయంత్రానికి వర్షం వచ్చే అవకాశం, పరీవాహకం నుంచి చెరువులోకి వరద తగ్గిపోవటంతో నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మూసిన అన్ని రోడ్లనూ తెరిచి రాకపోకలను పునరుద్ధరించారు.

రిటైర్డ్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి



నూతన కార్యవర్గాన్ని సత్కరించిన సభ్యులు

ఆమనగల్లు: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెన్షనర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించిన జీఓలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు రావాల్సిన ఐదు విడతల డీఏను వెంటనే ప్రకటించాలని అన్నారు. నగదు రహిత హెల్త్‌కార్డులు అందించాలని, నూతన పీఆర్‌సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, ఆమనగల్లు శాఖ అధ్యక్షుడు కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఆమనగల్లు సెక్టార్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా ఎన్నికల అధికారి జగదీశ్వర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామనాథం, ప్రధాన కార్యదర్శిగా జంగయ్య, ఆర్థిక కార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎంగలి బాలకృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా వెంకట్‌రెడ్డి, సుజాత, సంయుక్త కార్యదర్శిగా నారాయణగౌడ్, కార్యదర్శిగా హరికిషన్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా పురుషోత్తంరెడ్డి, భద్రయ్య, నర్సిరెడ్డి, విద్యాధర్, మహాలింగం, ఆంజనేయులు ఎన్నికయ్యారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకెళ్లాలి

- జీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాంశేఖర్

ఇబ్రహీంపట్నం: రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకెళ్లాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన అనంతరం తొలిసారి ఇబ్రహీంపట్నం విచ్చేసిన సందర్భంగా ఆదివారం స్థానిక భారత్ గార్డెన్‌లో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజనులంతా ఏకమై రాజ్యాధికారం సాధించినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీఎస్పీ పోటీ చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలోపు రాష్ట్రంలో బీఎస్పీ కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. మహనీయులు కాన్షీరాం, అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తూ రాజ్యాధికార సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జాతీయ నాయకుడు అత్తర్‌సింగ్‌తో, నాయకులు పల్లాటి రాములు, చెరుకూరి రాజు, నితిన్ కిషోర్, బాలయ్య, దయానంద్‌రావు, బోయిని చంద్రశేఖర్, ప్రభుదాసు, జగన్, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.



బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాంశేఖర్, జాతీయ నాయకుడు అత్తర్ సింగ్‌ను సన్మానించిన నాయకులు

స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరేస్తాం

- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- జిల్లా ముఖ్య నేతల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో కనిపించడం లేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి అన్నారు. ఒకవేళ నిర్వహిస్తే జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలన్నీ బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ఖాయమని చెప్పారు. ఈ మేరకు ఆదివారం శంషాబాద్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేరుతో 22 నెలలుగా నాటకాలాడుతున్న రేవంత్ ప్రభుత్వం మొదట్లోనే ఎందుకు జీఓ జారీ చేయలేదని ప్రశ్నించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాక అమలు చేయడం లేదని అన్నారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించితే రాజ్యాంగబద్ధంగా చర్యలు చేపట్టాల్సింది పోయి జీఓ జారీ చేయడం కాలయాపన కోసమేనని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లకు అసెంబ్లీ తీర్మానం, గవర్నర్ ఆమోదం, కేంద్ర ఆమోదం కోసం ఢిల్లీలో ధర్నా తదితర డ్రామాలతో కాలయాపన చేసిన రేవంత్ చివరికి మోసపూరిత జీవో జారీచేసి ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. వాస్తవా లను గమనించలేనంత అమాయకులు ప్రజలు కారని, మోసకారి కాంగ్రెస్‌కు కర్రకాల్చి వాత పెట్టే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఏ రిజర్వేషన్లు వచ్చినా పోటీకి సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, సీనియర్ నాయకుడు క్యామ మల్లేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యులు పట్నం అవినాష్ రెడ్డి, బూర్కుంట సతీష్, రమేశ్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు నర్సింగ్ రావు, నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు దేశమోల్ల ఆంజనేయులు, కార్మిక నాయకుడు పి.నారాయణ పాల్గొన్నారు.

మీనాల మృత్యుఘోష

- మీర్‌పేట చెరువులో కుప్పలుగా తేలిన చేపలు
- చెరువు ప్రాంతమంతా దుర్వాసన
- రూ.10 లక్షల వరకు నష్టం జరిగినట్టు అంచనా
- మురుగునీరు కలవడంతో మృతి చెందాయంటున్న మత్స్యకారులు



పెద్ద చెరువులో తేలియాడుతున్న చేపలు

మీర్‌పేట: మూడురోజుల క్రితం చెరువులోకి మురుగునీరు వదలడంతో వందలాది చేపలు మృత్యువాత పడ్డాయి. ఆదివారం తేలి ఒడ్డుకు చేరుకోవడంతో వాకర్స్ గమనించి మత్స్యకారులకు సమాచారం అందించారు. వివరాలివీ.. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువులో ఎనిమిది నెలల క్రితం మత్స్య సొసైటీ ఆధ్వర్యంలో 4 లక్షల వరకు చేప పిల్లలను వదిలారు. తాజాగా 20 రోజుల క్రితం చేపలు పట్టడం ప్రారంభించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు బడంగ్‌పేట ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున వరద నీటి ప్రవాహానికి తోడు మురుగునీటిని కూడా ట్రంక్‌లైన్ ద్వారా నేరుగా చెరువులోకి వదిలారు. దీంతో 3 నుంచి 5 కిలోలు ఉన్న భారీ సైజు చేపలు సైతం మృతి చెందాయి. పట్టి అమ్మకానికి సిద్ధంగా ఉన్న చేపలు ఇంతలోనే మృత్యువాత పడడంతో మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు. చెరువులో మురుగునీరు కలపొద్దని తాము ఎన్నిసార్లు మున్సిపాలిటీ వారికి చెప్పినా పట్టించుకోలేదని, గత సంవత్సరం లాగే ఈసారి కూడా పెద్ద ఎత్తున చేపలు మృతి చెందాయని ఆందోళన వ్యక్తం చేశారు. చేపలన్నీ మృతి చెంది ఒడ్డుకు చేరుకోవడంతో చెరువు పరిసర ప్రాంతమంతా తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. భరించలేని వాసన రావడంతో వాకింగ్ చేయలేకపోతున్నామని వాకర్స్ తెలిపారు. మృతి చెందిన చేపలను వెంటనే సంబంధిత అధికారులు తొలగించే చర్యలు తీసుకోవాలని కోరారు.

చర్యలు తీసుకోవాలి

మురుగునీరు చెరువులోకి వదలడంతో చేపలన్నీ మృతి చెందాయి. గత సంవత్సరం కూడా ఇలాగే జరిగింది. ఈ ఏడు పెద్ద ఎత్తున చేప పిల్లలను చెరువులో వదలడం జరిగింది. 3 నుంచి 5 కిలోల వరకు పెద్దవయ్యాక మృత్యువాత పడడం బాధాకరం. భవిష్యత్తులో పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గువ్వల శ్రీకాంత్, మత్స్యకారుడు

శ్రమించి.. కొలువు సాధించి


ఆనంద్‌గౌడ్


సురేష్‌గౌడ్


దేవరాం


రాకేష్‌గౌడ్

జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు ఆదివారం టీజీపీఎస్సీ వెల్లడించిన గ్రూప్–2 ఫలితాల్లో సత్తా చాటారు. వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలిచారు.

గ్రూప్–2 ఫలితాల్లో సత్తా చాటిన జిల్లా అభ్యర్థులు

మాడ్గుల: మండలంలోని నాగిళ్ల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు గ్రూప్–2 ఫలితాల్లో మెరిశారు. ఒకే కుటుంబానికి చెందిన కంచనపల్లి ఆనంద్‌గౌడ్, కంచపల్లి సురేష్‌గౌడ్ ఉన్నత ఉద్యోగాలు సాధించడంతో కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తులు అభినందించారు. ఆనంద్‌గౌడ్‌కు డిప్యూటీ తహసీల్దార్, సురేష్‌గౌడ్‌కు అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్‌గా కేటాయించారు.

బండలేమూర్ వాసి ప్రతిభ

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దేవరాం గ్రూప్–2 ఫలితాల్లో అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ ఉద్యోగాన్ని సాధించారు. మంచాల మండలం బండలేమూర్ గ్రామానికి చెందిన దేవరాం వికారాబాద్ జిల్లా కుల్కచర్లలోని గురుకుల విద్యాలయంలో పదో తరగతి వరకు, ఇబ్రహీంపట్నంలోని కార్తికేయ కళాశాలలో ఇంటర్, నగరంలోని నిజాం కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. గతేడాది వెలువడిన గ్రూప్–4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో పనిచేస్తున్నాడు. తాజాగా గ్రూప్–2లో ఫలితాల్లో ఏసీటీఓ ఉద్యోగాన్ని సాధించడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని దేవరాం అన్నారు

దృఢ సంకల్పంతో చదివి


చంద్రకాంత్

ఇబ్రహీంపట్నం రూరల్: మండలంలోని పోల్కంపల్లి గ్రామానికి చెందిన గుండ్ల రాకేష్‌గౌడ్ గ్రూప్–2 ఫలితాల్లో అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించారు. చిన్నప్పటి నుంచి ఆయన చదువుల్లో చురుకు. తల్లిదండ్రులు కూలీ పనులు చేసి చదివించారు. దృఢ సంకల్పంతో ఉన్నత చదువులు చదివి గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాడు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా వెలువడించిన ఫలితాల్లో ఏసీటీగా ఉద్యోగం సాధించారు. దీంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

కొత్తపల్లివాసికి 27వ ర్యాంక్

శంకర్‌పల్లి: గ్రూప్–2 ఫలితాల్లో 27వ ర్యాంక్ సాధించి మండలవాసి సత్తా చాటాడు. కొత్తపల్లి గ్రామానికి చెందిన చంద్రకాంత్‌కి చార్మినార్ జోన్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా నియామకం అయినట్లు తెలిపారు. ఇప్పటికే ఆయన రామచంద్రపురంలోని ప్రభుత్వ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన గతంలోనూ చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా.. అంతకు ముందు పోస్టల్ శాఖలో జాబ్ సైతం చేశారు. తాజాగా డిప్యూటీ తహసీల్దార్‌గా నియామకం అవ్వడంపై ఆనందం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రాంచంద్రి (ఫైల్)

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కందుకూరు మండల పరిధిలోని బేగరికంచె గ్రామానికి చెందిన ఢిల్లీ రాంచంద్రి(50) అమెజాన్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మీరాఖాన్‌పేటలో వ్యక్తిగత పనుల నిమిత్తం వచ్చి తిరిగి బైక్‌పై ఆదివారం రాత్రి 7 గంటలకు ఇంటికి వెళ్తున్నాడు. మార్గ మధ్యలో ఎదురుగా అతి వేగంగా వచ్చిన ఓ బొలెరో వాహనం ఆయన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రాణి, ముగ్గురు పిల్లలున్నారు. ఇదిలా ఉండగా ఫ్యూచర్‌సిటీ కార్యాలయ శంకుస్థాపనకు సీఎం రేవంత్‌రెడ్డి రావడంతో పోలీసులు మీరాఖాన్‌పేట–కందుకూరు గ్రామాల మధ్య డబుల్‌రోడ్డులో ఒక మార్గాన్ని పూర్తిగా మూసేశారు. సాయంత్రం వరకు క్లియర్ చేయకపోవడంతో వన్ వేలోనే ఎదురెదురుగా వాహనాల రాకపోకలు సాగించాయి. ఈ క్రమంలోనే రాంచంద్రి మృతి చెందినట్లు బేగరికంచె గ్రామస్తులు ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని బంధువులు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఔటర్‌పై కారు బోల్తా: ఐటీ ఉద్యోగి..

శంషాబాద్: ఔటర్‌పై అదుపు తప్పి కారు బోల్తా పడటంతో ఐటీ ఉద్యోగి మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లాకు చెందిన అశోక్‌కుమార్(35) నగరంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. శనివారం రాత్రి అతను భార్య జానకమ్మతో పాటు ఆమె సోదరుడు ఉదయ్ భాస్కర్‌రెడ్డి పిల్లలతో కలిసి ప్రకాశం జిల్లా నుంచి కారులో మణికొండకు బయలుదేరారు. తెల్లవారు జామున శంషాబాద్ సమీపంలోని తొండుపల్లి వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడటంతో తీవ్రంగా గాయపడిన అశోక్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని కుమార్తె నితిష, ఉదయ్‌భాస్కర్‌రెడ్డిలకు తీవ్ర గాయాలు కావడంతో పోలీసులు వారిని సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వానొస్తే.. గండమే!


కొందుర్గు మండలం వెంకిర్యాల వాగు దుస్థితి

రోడ్లపై వంతెనలు లేక తీవ్ర ఇక్కట్లు

- వాగు దాటే క్రమంలో ప్రాణాలు కోల్పోతున్న వైనం
- వరద ప్రవాహంలో కొట్టుకుపోయి ముగ్గురు మృతి
- పట్టించుకోని పాలకులు, అధికారులు

కొందుర్గు: గ్రామాల్లో వాగులపై వంతెనలు లేకపోవడంతో సామాన్యులు ప్రాణాలు కోల్పోవాల్సిన దౌర్భాగ్యం ఏర్పడింది. భారీ వర్షాలు కురిసినప్పుడు వాగులు ఉప్పొంగడంతో ఈ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అయినా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం. ఈ ఏడాది కురుస్తున్న అధిక వర్షాలకు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో ఇప్పటికే చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతున్నాయి. ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఏ చిన్న పని కోసం బయటికి వెళ్లాలన్నా వాగులు దాటాలి. వాటిపై వంతెనలు లేకపోవడంతో బయటికి వెళ్లిన వారు తిరిగి ఇంటికి క్షేమంగా చేరుకుంటారా లేదా అనే సందిగ్ధం నెలకొంది.

ఘటనలు అనేకం

పదేళ్ల క్రితం కొందుర్గు మండలం ముట్పూర్ గ్రామానికి చెందిన కావలి సత్యమ్మ పంట పొలానికి వెళ్లి తిరిగి వస్తూ వాగు దాటే ప్రయత్నంలో వరదలో కొట్టుకుపోయి మృతిచెందింది. రెండేళ్ల క్రితం విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన జాహంగీర్ పక్క గ్రామమైన తంగెళ్లపల్లికి వెళ్లి వస్తుండగా చిన్న వాగు దాటుతూ ప్రాణాలు కోల్పోయాడు. తాజాగా శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుర్రంపల్లి గ్రామానికి చెందిన ఎన్కెపల్లి సత్తయ్య పక్క గ్రామమైన ఇంద్రానగర్ వెళ్లి తిరిగి వస్తుండగా వాగు వరద ఉధృతిలో కొట్టుకుపోయి మృతిచెందాడు. కొందుర్గు మండలం వెంకిర్యాల గ్రామానికి లింగమయ్య(42) శుక్రవారం సాయంత్రం విశ్వనాథ్‌పూర్ నుంచి తంగెళ్లపల్లి వెళ్లే ప్రయత్నంలో వాగు దాటుతూ కొట్టుకుపోయాడు. శనివారం ఉదయం వాగు పక్కన ముళ్లపొదలకు తట్టుకొని శవమై తేలాడు. ఇలా వంతెనలు లేకపోవడంతో అభాగ్యుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్లపై వంతెనలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వంతెనలు లేని గ్రామాలు

కొందుర్గు మండలం రేగడిచిల్కమర్రి, ముట్పూర్, టేకులపల్లి, ఉత్తరాసిపల్లి, బైరంపల్లి, లాలపేట, గంగన్నగూడ, విశ్వనాథ్‌పూర్, జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల, తూంపల్లి, తుమ్మలపల్లి, లచ్చంపేట, పద్మారం, చేగిరెడ్డిఘనాపూర్, జాకారం, గుంజల్‌పహాడ్, పీర్జాపూర్, ముష్టిపల్లి తదితర గ్రామాలకు వెళ్లే దారుల్లో వంతెనలు లేకపోవడంతో వర్షాలు కురిస్తే రాకపోకలు నిలిచిపోతాయి.

ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే ప్రజలు చనిపోతున్నారు. ప్రస్తుం ఇవన్నీ సర్కారు హత్యలే. గడిచిన పదేళ్లలో వంతెనలు నిర్మించలేదు. అప్పట్లో కాంగ్రెస్ నాయకులు వంతెనల కోసం పాదయాత్రలు చేశారు. కానీ ప్రస్తుతం వాగులు దాటుతూ ప్రజలు చనిపోతున్నా పట్టించుకోవడం లేదు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి.

– లక్ష్మీకాంత్‌రెడ్డి, బీజేపీ కొందుర్గు అధ్యక్షుడు

వరద ఉధృతి ఎక్కువ



గతంలో గ్రామాలకు వెళ్లే దారుల్లో లో లెవల్ వంతెనలున్నాయి. ప్రస్తుతం వరదల ఉధృతి తీవ్రంగా ఉంది. అన్ని గ్రామాలకు వెళ్లే దారుల్లో హైలెవల్ వంతెనలు నిర్మించాలి. ఇప్పటికే విశ్వనాథ్‌పూర్ చిన్న వాగు దాటుతూ ఇద్దరు మృతిచెందారు. ఇతర అభివృద్ధి పనులు నిలిచిపోయినా అత్యవసరంగా వంతెనలు పూర్తి చేయాలి.

– శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ కొందుర్గు అధ్యక్షుడు

శాకాహారంతో ఆరోగ్యానికి మేలు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ శాకాహారం అలవాటు చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ఆదివారం బ్రహ్మర్షి పితామహ పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ జిల్లా అధ్యక్షుడు నడిమొళ్ల శంకర్ ఆధ్వర్యంలో మహాకరుణ అహింసా శాకాహార ర్యాలీ, ధ్యాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజలకు ఆరోగ్యం సమాజం, ప్రకృతి కోసం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. శాకాహారం అనేది ఆరోగ్యానికి, ఆధ్యాత్మికతకు మంచిదన్నారు. ధాన్యంతో ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరూ ధ్యానం అలవాటు చేసుకుంటే మానసిక ప్రశాంతత ఆరోగ్యం లభిస్తాయని చెప్పారు.


శాకాహార ర్యాలీ ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచులు శైలజ, భీమయ్య, ప్రభాకర్, నాయకులు వసంతం, వెంకట్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, ఆగిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటరంగారెడ్డి, రాములు, శ్రీశైలం, ప్రభాకర్, రాజు, నర్సింలు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల కూల్చివేతలపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: అక్రమంగా ఇళ్లను కూల్చి వేసిన వారిపై ఆదిబట్ల పోలీసులు ఆదివారం కేసులు నమోదు చేశారు. ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి, 4 జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నోయల్‌రాజ్ కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడ, శ్రీశ్రీనగర్ కాలనీలో సర్వే నంబరు 338లో ఉన్న ప్లాటు నంబరు 140, 143, 163 నుంచి 166 వరకు గల ప్లాట్లను గుర్రం జైపాల్‌రెడ్డి, కర్ర గోవర్ధన్‌రెడ్డిల ప్రోత్సాహంతో నేనావత్ అశోక్‌కుమార్, రత్లావత్ రవి 20 రోజుల క్రితం ప్లాట్లు కొనుగోలు చేశారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం శనివారం తెల్లవారు జామున 5 జేసీబీలు తీసుకొచ్చి 9 ఇళ్లను కూలగొట్టి ఇంట్లో ఉన్న వారిని బయటకు పంపించి సామాన్లు బయట వేశారు. ఇళ్లలో ఉన్న విలువైన వస్తువులను దొంగిలించారు. కోటి రూపాయలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఎన్–ఓల్ పబ్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్: నిబంధనలు ఉల్లంఘించి పోలీసుల కళ్లుగప్పి తెల్లవారుజాము వరకు పబ్ నిర్వహిస్తున్న యజమానిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–36లోని పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎన్–ఓల్ అనే పబ్ రాత్రి ఒంటి గంటకు కార్యకలాపాలు ముగించాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం తెల్లవారుజామున 3 గంటల వరకు కస్టమర్లకు లిక్కర్ సరఫరా చేయడమే కాకుండా డీజే సౌండ్‌తో న్యూసెన్స్ క్రియేట్ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు చేపట్టగా పబ్‌లో కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు గుర్తించారు. దీంతో ఎన్–ఓల్ పబ్ యజమాని చిలంకుర్తి శంకర్, మేనేజర్ వీరగోని వంశీ, బొన్సర్లు మహమూద్, సూర్యకిరణ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గామాతకు ఎంపీ పూజలు


అమ్మవారి సన్నిధిలో ఎంపీ ఈటల

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి కొంగరకలాన్‌లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ దుర్గమాతను ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. శివాలయం వీధిలో కొలువైన అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎంపీని సన్మానించారు.

పిటిషన్ వెనక్కి తీసుకోవాలి


ప్లకార్డుల పట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

బీసీ జేఏసీ నేతల డిమాండ్

షాద్‌నగర్: ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ జీఓ జారీ చేస్తే రెడ్డి జాగృతి సంస్థ సభ్యులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం సరికాదని షాద్‌నగర్‌కు చెందిన బీసీ జేఏసీ నాయకులు టీజీ శ్రీనివాస్, రవీంద్రనాథ్, అర్జున్, నర్సింలు తదితరులు డిమాండ్ చేశారు. పిటిషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పట్టణ చౌరస్తాలో ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేస్తే దానిని వ్యతిరేకిస్తూ రెడ్డి జాగృతి సంస్థ కోర్టుకు వెళ్లడం సరికాదన్నారు. ప్రభుత్వం విద్య, ఉద్యోగాల్లో ఈడబ్ల్యూసీ కోటాలో పదిశాతం పెంచినప్పుడు బీసీలు ఎప్పుడు వ్యతిరేకించలేదని గుర్తు చేశారు. కానీ బీసీలకు ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తే రెడ్డి జాగృతి కోర్టుకు వెళ్లడంతో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రెండు వర్గాల మధ్య అలజడి సృష్టించే విధంగా రెడ్డి జాగృతి సంస్థ వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలుగౌడ్, కరుణాకర్, చంద్రశేఖర్, వెంకటేష్, శంకర్, శ్రీను, నర్సింలు, నరేష్, రామలింగం, శేఖర్‌గౌడ్, కృష్ణ, బిజిలి సత్యం తదితరులు పాల్గొన్నారు.

నటికి కాబోయే భర్త ఆత్మహత్య


సవాయ్ సింగ్ (ఫైల్)

బంజారాహిల్స్: నేను జీవితంలో చాలా తప్పులు చేశాను... ఇక మళ్లీ అలాంటి తప్పులు చేయను అంటూ సెల్ఫీ వీడియో పోస్ట్ చేసిన ఓ నటికి కాబోయే భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... రాజస్తాన్‌కు చెందిన సోహాని బాలీవుడ్, టాలీవుడ్‌తో పాటు పలు భాషల్లో సినిమాల్లో నటిస్తోంది. ఇటీవల ఆమెకు రాజస్తాన్‌కు చెందిన సవాయ్ సింగ్ అనే యువకుడితో ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ఇద్దరి మధ్య ప్రేమకు దారి తీసింది. గత జూలైలో ఇద్దరు నిశ్చితార్థం కూడా చేసుకున్నారు. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లోని ఓ ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్న సోహాని కుమారి అక్కడే ఉంటూ సినిమాల్లో నటిస్తోంది. శనివారం ఉదయం సవాయ్ సింగ్ ప్రశాసన్‌నగర్‌లోని ఆమె ఇంటికి వచ్చాడు. తర్వాత ఇద్దరూ కలిసి గచ్చిబౌలిలోని ఎవరి కార్యాలయాలకు వారు వెళ్లి పోయారు. సాయంత్రం సోహాని ఇంటికి వచ్చి తాళం తీసి లోపలికి వెళ్లి చూడగా డైనింగ్ హాల్‌లో సవాయ్ సింగ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఆత్మహత్య చేసుకునే ముందు అతను సెల్ఫీ వీడియో తీసుకున్నట్లు గుర్తించారు. సోహాని కుమారితో పరిచయానికి ముందు సవాయ్ సింగ్‌కు మరో యువతితో స్నేహం ఉండేదని ఆమెను మర్చిపోలేకపోవడం, ఆర్థిక సమస్యల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సోహాని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించగా శుక్రవారం ఉదయం 11.47 గంటలకు సవాయ్ సింగ్ ఆమె ఉంటున్న ఫ్లాట్ వెనుక డోర్ ద్వారా ఇంట్లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారించారు. కేసు నమోదు చేసుకునిని దర్యాప్తు చేపట్టిన పోలీసులు క్లూస్ టీమ్ సహాయంతో ఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్నారు. ఆయన మాజీ స్నేహితురాలిని కూడా విచారిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల: మానసిక ఒత్తిడి తాళలేక ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. షాపూర్‌నగర్‌కు చెందిన యలగందుల నవమోమన్ కుమారుడు శరణ్‌దీప్(24) ప్రైవేట్ ఉద్యోగం చేసేవాడు. శనివారం రాత్రి భోజనం చేసిన తర్వాత అతను ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం హెచ్‌ఎంటీ సమీపంలోని ఖాళీ స్థలంలో ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతుడిని శరణ్‌దీప్‌గా గుర్తించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం, సమస్తిపూర్ జిల్లా, దౌలత్‌పూర్ గ్రామానికి చెందిన హీరా కుమార్(31) మల్లాపూర్‌లోని ఎఫ్‌సీఐ గోదాములో హమాలీగా పని చేస్తున్నాడు. ఈ నెల 27న తన స్నేహితుడు అభిషేక్ అనే వ్యక్తిని రైలు ఎక్కించేందుకు చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లి దర్భంగా ఎక్స్‌ప్రెస్ రైలెక్కించాడు. మల్లాపూర్‌లోని తన రూమ్‌కు తిరిగి వెళ్లేందుకు పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన రైలు హీరా కుమార్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం తెల్లవారుజామున సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

ఉరేసుకుని విద్యార్థి బలవన్మరణం

హయత్‌నగర్: ఫ్యాన్‌కు ఉరేసుకుని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కొహెడ గ్రామానికి చెందిన నవీన్‌కుమార్(19) మంగల్‌పల్లిలోని శ్రీ ఇందూ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై సమాచారం అందడంతో సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో ప్రయాణికుడి మృతి


అన్సారీ మృతదేహం

సికింద్రాబాద్: రైలులో ప్రయాణిస్తున్న యువకుడు మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పరిధిలో జరిగింది. రైల్వే కానిస్టేబుల్ పండరి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జార్ఖండ్‌కు చెందిన ఆలమ్ అన్సారి(27) అనే యువకుడు హౌరా నుంచి సికింద్రాబాద్‌కు ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్నాడు. ఆదివారం ఉదయం అతను కోచ్ నంబర్ 5లోని సీట్ నెం. 32లో మృతి చెంది ఉన్నాడు. విధుల్లో ఉన్న రైల్వే టీటీఐ ద్వారా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ మార్చురీకి తరలించారు.

కారు–బైక్ ఢీ.. యువకుడి దుర్మరణం


వినోద్‌నాయక్ మృతదేహం

ఆమనగల్లు: పట్టణంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం కారు–బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడి మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పోలెపల్లి గ్రామ పరిధిలోని పాపర్లబోడుతండాకు చెందిన కేతావత్ వినోద్‌నాయక్(28) వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై ఆమనగల్లు వచ్చాడు. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై వస్తుండగా అచ్చంపేట వైపునకు వెళుతున్న కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో వినోద్‌నాయక్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు, తండావాసులు పెద్ద సంఖ్యలో సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేశారు. దాదాపు అరగంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సైబర్ నేరగాళ్ల టోకరా

పోచారం: ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు మోసం చేసిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. పెద్దపల్లి జిల్లా, హనుమాన్‌నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని వల్లపురెడ్డి సుశ్రుత పోచారంలోని సింగపూర్ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటోంది. ఈ నెల 24న ఆమె సోదరి వాట్సాప్ నుంచి రూ. 4600 కావాలని మెసేజ్ రావడంతో డబ్బు పంపింది. మళ్లీ రూ. 20 వేలు కావాలని మెసేజ్ రావడంతో రూ. 10 వేలు పంపిన తర్వాత సోదరికి ఫోన్ చేయగా తన వాట్సాప్ హ్యాక్ అయిందని చెప్పింది. దీంతో సైబర్ నేరగాళ్లు తనను మోసం చేసినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గ్యాస్ సిలిండర్ పేలి గృహోపకరణాలు దగ్ధం



దగ్ధమైన గృహోపకరణాలు

అల్విన్‌కాలనీ: గ్యాస్ సిలిండర్ పేలి గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన ఎల్లమ్మబండ, అంబేడ్కర్ నగర్‌లో చోటు చేసుకుంది. అంబేడ్కర్ నగర్‌కు చెందిన బోయరాజు అనే వ్యక్తి కొన్నేళ్లుగా కమర్షియల్ సిలిండర్లను తెచ్చి చిన్న సిలిండర్లలో నింపి విక్రయిస్తున్నాడు. ఆదివారం ఉదయం శివ అనే వ్యక్తి అతడి వద్ద సిలిండర్ తీసుకెళ్లాడు. ఇంట్లో వంట చేసుకునేందుకు స్టవ్ వెలిగించడంతో ఒక్కసారిగా సిలిండర్ పేలి మంటలు చెలరేగడంతో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

విజయనగర్‌కాలనీ: మేకలకు ఆకులు తెంపడానికి వెళ్లి ఓ వ్యక్తి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన ఆదివారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ దయానంద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం ఆసిఫ్‌నగర్ సయ్యద్‌అలీగూడలోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న రావిచెట్టు ఆకులు తెంపడానికి ప్రహరీ పైకి ఎక్కాడు. ఆకులు తెంపే క్రమంలో ప్రమాద వశాత్తు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఆసిఫ్‌నగర్ పోలీసులు 108కు సమాచారం అందించారు. అతడిని పరీక్షించిన అంబులెన్స్ సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుని సంబంధికులు ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.